క్లుప్తంగా

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: చింతలకోటి గరువు గ్రామంలో శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ టి.బ్రహ్మం భగవద్గీత శ్లోకాలు పాడి వాటి అర్థాలను వివరించారు. ధ్యాన విశిష్టత తెలిపి అందరితో ధ్యానం చేయించారు. అనంతరం రాయకుదురు, చింతలకోటి గరువు చిన్నారులు చేసిన కోలాట నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన పంజా బాల శ్రీలక్ష్మి, నృత్య గురువులను, కేవీడీ ప్రసాద్ మాస్టర్, గ్రామ సర్పంచ్ దాసరి మహాలక్ష్మి, ఉప సర్పంచ్ దాసరి మాణిక్యాలు తదితరులను ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ డీవీఎస్ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు కోల్లేపర శ్రీనివాసరావు, కాకిలేటి సీతారాముడు, యిర్రింకి కొండ, కామిశెట్టి శ్రీను, ఘంటా నాగదాసు, పంజా సురేష్, పసుపులేటి రాంబాబు, లంకలపల్లి నరసింహారావు, పి.తాతయ్యనాయుడు, కొమ్మన శ్రీను పాల్గొన్నారు.

పేరుపాలెంలో వైద్య శిబిరం

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం సౌత్ పంచాయతీలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవాడకు చెందిన మన్వి ఆసుపత్రి వైద్యులు ఓసూరి బాల బాలాజీ హేమ బిందువుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన ఓసూరి వెంకటస్వామి నాయుడు జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరంలో 1000 మంది రోగులకు న్యూరాలజీ, గైనకాలజీ, చర్మ, ఎముకలు, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మి ప్రారంభించగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కర్రి ఏసుబాబు, కారుమంచి జీవరత్నం, ఏఎంసీ వైస్ చైర్మన్ కటికల సూర్యారావు, వినుకొండ కాశీ, వనమాల శ్రీనివాస్, ఓసూరి కుటుంబ సభ్యులు సేవలందించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత

తాడేపల్లిగూడెం రూరల్: మారంపల్లిలో సంభవించిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన మొండి రాజగణేష్ కుటుంబానికి దాతలు ముందుకొచ్చి సహాయ, సహకారాలు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం గ్రామానికి చెందిన షారోన్ లూథరన్ చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో పాస్టర్ గెడ్డం మోషె 25 కిలోల బియ్యం, దుస్తులు, వంట పాత్రలు, నిత్యావసర సరుకులను అందజేశారు. టీడీపీ, గ్రామ జనసైనికుల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు.

పంట కాలువ అధ్వానం

నరసాపురం: పట్టణం మీదుగా చినమామిడిపల్లి–సరిపల్లి మీదుగా వెళ్లే పంట కాలువ అధ్వానంగా తయారైంది. పంటకాలువలో పూడిక పెరిగిపోయింది. అలాగే కాలువ నిండా చెత్తా పేరుకుపోయింది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకూ సుమారు 5 వేల ఎకరాల భూములకు, దాదాపు 40 గ్రామాలకు సాగు, తాగునీటి అవసరాలకు ఈ కాలువే దిక్కు. అయితే ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో నీరుపారడం లేదు. శివారు ప్రాంతాలకు అసలు నీరు చేరడం లేదు. ఈ కాలువలో పూడిక తీసి, శుభ్రం చేసి ఏడాదికాలం పైనే అవుతోంది. ప్రస్తుతం వేసవి కాలం వచ్చేసింది. కాలువలు కట్టేసే సమయం కూడా దగ్గర పడుతుందని ఇప్పటికైనా కాలువ శుభ్రం చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

దుర్గాలక్ష్మణేశ్వరుని తెప్పోత్సవం

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరంలో ఉన్న శ్రీ దుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలో ఉన్న కోనేరులో హంస వాహనాన్ని పూలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులమధ్య దుర్గాలక్ష్మణేశ్వరులను మేళతాళాలతో ఆలయం నుంచి వేడుకగా తీసుకువచ్చి సుందరంగా అలంకరించిన కోనేరులోని తెప్పపై స్వామివారిని ఊరేగించారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. తొలుత ఆలయంవద్ద టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో సంగీతం–బుర్రకథ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు, ఈవో చాగంటి సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి వెళ్లి వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 15 మందికి ఇంటి వద్దకే వెళ్లి ఉచిత వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. సంచార వైద్యశాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యుడు బొండాడ వెంకటేశ్వర్లు పట్టణం, హౌసింగ్ బోర్డు, వేల్పూరు, తేతలి, తదితర గ్రామాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘ సభ్యుడు అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో సమకూర్చిన మందులను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

కనులపండుగగా శివపార్వతుల కల్యాణం



శివునికి ప్రత్యేక పూజలు చేస్తున్న దత్తార్చిత సరస్వతి



ప్రాతాళ్లమెరక ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



భీమేశ్వరస్వామివారి రథోత్సవ దృశ్యం

కాళ్ల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రాతాళ్లమెరకలో ఆదివారం శివ పార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు వేగేశ్న బాల గణపతి వర్మ, సోదరులు వేగేశ్న మాధవరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కన్నులపండుగగా స్వామివారి కల్యాణం మంగళదాయకంగా జరిపారు. ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణ నడుమ స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేగేశ్న బలరామరాజు కుటుంబ సభ్యుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు సాగిరాజు హరివర్మ, సాగిరాజు సుబ్బరాజు, చంటిరాజు, కంతేటి శ్రీనివాసరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి జాగరణ

పాలకోడేరు: పాలకోడేరులోని గొల్లలకోడేరు రోడ్డులో సచ్చిదానంద సరస్వతి విశ్వజ్ఞాన పీఠం అధ్వర్యంలో మహాశివరాత్రి జాగరణ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భగవాన్ ట్రేడర్స్ అధినేత నడింపల్లి వెంకటరామరాజు ఆధ్వర్యంలో స్వామి దత్తార్చిత సరస్వతి వారిచే ఈ కార్యక్రమం కన్నులపండుగగా జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు గురుపూజ, 6 గంటలకు మహాన్యాస పఠనం, 9 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, శత రుద్రీయం, సుమారు 70కిపైగా పూజా ద్రవ్యాలతో పరమేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం వరకు ఏకధాటిగా మహాశివ రాత్రి జాగరణ ఉత్సవాలు జరిగాయి. మృత్తికా లింగానికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేసి తన్మయత్వం చెందారు. భట్టిప్రోలు శ్రీనివాస్, డాక్టర్ రాజన్‌రాజు, డాక్టర్ విజయబాబు, చైతన్య భారతి అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, నడింపల్లి మహేష్, పేరిచర్ల లక్ష్మణవర్మ, చుక్కనశ్రీ, బాబ్జి, మహిళలు పాల్గొన్నారు.

ఉండి, కలిసిపూడిలో కొనసాగుతున్న ఉత్సవాలు

ఉండి: మహాశివరాత్రి ఉత్సవాలు ఉండి, కలిసిపూడి గ్రామాల్లో కొనసాగుతున్నాయి. ఆదివారం భక్తులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సమేతంగా కలిసిపూడిలోని భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామిని, ఉండిలోని పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉండిలో నిర్వహించిన పుష్పయాగం, మహాపూర్ణాహుతి, త్రిశూలస్నానం కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా ఆలయాల వద్ద సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. 20వ తేదీతో ఉండిలోని ఉత్సవాలు ముగియనుండగా కలిసిపూడిలో వచ్చేనెల 6వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని కమిటీ పెద్దలు తెలిపారు.

భీమేశ్వరస్వామి రథోత్సవానికి భారీగా భక్తులు

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని భీమేశ్వర స్వామివారి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. తొలుత రథోత్సవాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజ ప్రారంభించగా, దేవస్థానం నుంచి సింహాద్రి అప్పన్న దేవస్థానం రోడ్డు, రెస్ట్ హౌస్ రోడ్డు మీదుగా మావుళ్లమ్మ దేవస్థానం వరకు రథోత్సవం సాగింది. అధిక సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి తెప్పోత్సవం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శివాలయంలోని రామలింగేశ్వరస్వామికి ఆదివారం హంస వాహనంపై తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. హంస వాహనంపై రామలింగేశ్వరస్వామి తిరుగాడుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఎన్నికల కోడ్ అమలులో చిత్తశుద్ధి ఏదీ?

- వైఎస్సార్ సీపీ నేతల ఫ్లెక్సీల తొలగింపులో అత్యుత్సాహం
- ఇతర రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించని అధికారులు
- కాళ్ల మండలంలో అధికార యంత్రాంగం వింత పోకడ

కాళ్ల: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తుండటంతో మండలంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కొన్ని గ్రామాల్లో సంపూర్ణంగా కోడ్ అమలు చేస్తున్నప్పటికీ మరికొన్ని గ్రామాల్లో కోడ్ అమలులో అధికారులు చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కొన్ని గ్రామాల్లో అధికారులు ఆయా రాజకీయ పార్టీలు ఫ్లెక్సీలు తొలగించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు తొలగించి ప్రతిపక్ష పార్టీలైన తెలుగుదేశం, జనసేన పార్టీల ఫ్లెక్సీలు తొలగించడం లేదని పలువురు నాయకులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మండల శివారులోని పల్లెపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు తొలగించే వరకు అధికారులు ఊరుకోలేదని, కానీ తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు తొలగించకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. దీంతోపాటు జువ్వలపాలెం, కాళ్ల, పెద అమిరం తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు ఇప్పటికీ దర్శనమిస్తుండటం గమనార్హం. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో ఎన్నికల కోడ్ అమలయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ ఎం. సూర్యతేజ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందించాలని కోరారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



తణుకులో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ ఘట్టం

తణుకు అర్బన్: విశ్వబ్రాహ్మణుల ఆరాధ్యదైవం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తణుకు పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ రాత్రి నాగులకొండ శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి, చిప్పాడ శ్రీనివాసరావు, చాముండేశ్వరి దంపతులతో వేద మంత్రోచ్ఛరణముల మధ్య కల్యాణ ఘట్టం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పాడుగు రామాచారి (రాము), ఆలయ చైర్మన్ కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు.

స్త్రీల సమాజ కార్యవర్గ ఎన్నిక



బేతనీ స్త్రీల సమాజ నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: బేతనీ లూథరన్ చర్చి స్త్రీల సమాజం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పట్టా ఇందిరా, కార్యవర్గ సభ్యులుగా బి.జ్ఞానకుమారి, పి.జెమిని, పి.అలీస్, ఎస్.నీలిమ, పి.సోని తదితరులు ఎన్నికయ్యారు. అదే విధంగా రెస్ట్‌హౌస్ రోడ్డు క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ చైర్మన్‌గా బేతనీ పేటకు చెందిన ఎం.ఆనోకిన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. పి. రతన్, పి.సుదర్శన్‌కుమార్, పి.జోసెఫ్, కె.ప్రకాష్, గంటా సుందర్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామానికి పెద్దదిక్కు కోల్పోయాం

సర్రాజు ఆకస్మిక మృతిపై కన్నీటి పర్యంతమైన జక్కరం గ్రామస్తులు



సర్రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జక్కరం గ్రామవాసులు

కాళ్ల: తమ గ్రామానికి పెద్దదిక్కును కోల్పోయామంటూ జక్కరం గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆదివారం సర్రాజు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు స్వగ్రామం జక్కరం గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ భరోసానిస్తూ ముందుండేవారు. సమస్య ఎటువంటిదైనా శుభకార్యమైనా, ఎక్కడ ఉన్నా హాజరయ్యేవారు. గ్రామస్తులతో ఆయనకు విడదీయరాని బంధం ఉంది. స్వగ్రామం కావడంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి తోడ్పాటును అందించేవారు. సర్రాజు ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన్ని గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించి సర్రాజుపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. సర్రాజు కుమారులైన పాతపాటి శ్రీనివాస రాజు, యుగంధర్ వర్మలకు తామంతా ఎల్లప్పుడూ తోడుగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సర్రాజుకు సర్వోదయ మండలి నివాళి

సాక్షి, భీమవరం: క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు మరణం తీరని లోటని జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. సర్రాజు ఆకస్మిక మృతి పట్ల జిల్లా సర్వోదయ మండలి తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పెదనింద్రకొలనులోని గాంధీ స్మారక భవనాన్ని పునఃప్రారంభించడంలో సర్రాజు కృషి చేశారని గుర్తు చేశారు. సంతాపం తెలిపిన వారిలో చర్ల మృదుల కుమారి, సాగిరాజు జానకి రామరాజు తదితరులున్నారు.

చెరుకువాడలో ముగిసిన సువార్త సభలు



చెరుకువాడ సువార్త సభల్లో జాన్సన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఉండి: మంచితనం, మానవత్వం ప్రజలకు క్రీస్తు చూపిన మార్గం అని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిద జాన్సన్ అన్నారు. చెరుకువాడ చినపేట సీబీసీఎన్‌సీ చర్చి ఆధ్వర్యంలో సువార్త మహాసభలు శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. చివరిరోజు ముఖ్య అతిథిగా విచ్చేసిన జాన్సన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అందరినీ మంచిదారిలో నడిపిస్తున్నాయన్నారు. మనిషిలోని స్వార్థం మనిషిని చెడ్డవాడుగా మారుస్తుందన్నారు. తల్లి గర్భం నుంచి పుట్టినప్పుడు ఏమీ తీసుకురాలేదని, అలాగే మరణించిన తరువాత ఏమీ తీసుకువెళ్లలేమని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. దేవుని మాట చాలా శక్తి వంతమైనదన్నారు. బైబిల్ చదివి ఎన్నో విలువైన విషయాలు నేర్చుకోవాలన్నారు. యువత అభివృద్ధి చెందినప్పుడే వారి భవిష్యత్, జీవితం బాగుంటుందన్నారు. పేరిష్ పాస్టర్ ఎస్.జార్జ్‌ముల్లర్, సంఘ సీఆర్ ఎం.సామ్యూల్, సంఘపెద్దలు, పీసీసీ, స్త్రీల సమాజం, యూత్ ప్రతినిధులు, కాషియర్, సంఘస్తులు కే శ్యామ్, పీ.సురేష్, వై.జకర్యా, బీ మంగరాజు, వై గజేంద్ర, బీ మహేష్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశం



యూటీఎఫ్ జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న గోపీమూర్తి

సాక్షి, భీమవరం: ఉపాధ్యాయులపై వివిధ యాప్‌లు, బోధనేతర పనులతో ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు దిగడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో గోపీమూర్తి మాట్లాడుతూ బోధనేతర పనుల వలన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలోని 9 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సీపీఎస్, ఎన్ఈపీని రద్దు చేయాలని కోరుతూ 24న ఛలో ఢిల్లీ పేరుతో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, ఎం.మార్కండేయులు, కె.రాజశేఖర్, కె.శ్రీదేవి, సీహెచ్ పట్టాభిరామయ్య, పి.శివప్రసాద్, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

లయన్స్ సేవల విస్తరణకు కృషి చేయాలి



విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: సమాజానికి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా అందించే సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ గేట్ ఏరియా లీడర్ డీవీఎస్ రాజు చెప్పారు. ఆదివారం తణుకులోని కమ్మ కల్యాణ మండపంలో సజ్జాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ ప్రాంతీయ సేవా మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి లయన్స్ రీజియన్ చైర్ పర్సన్ పుట్టా విజయశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీవీఎస్ రాజు మాట్లాడుతూ లయన్స్ రీజియన్‌లో చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రీజియన్‌లోని 40 మంది పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. రీజియన్ పరిధిలోని క్లబ్ పనితీరుకు సంబంధించిన సేవా కార్యక్రమాల బేనర్ ప్రజెంటేషన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా క్లబ్‌ల పనితీరు ఆధారంగా అవార్డులను ప్రదానం చేశారు. లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్లను సత్కరించారు. లయన్స్ జిల్లా వైస్ గవర్నర్లు గట్టిం మానిక్యాలరావు, కాకర్ల వేణుబాబు, రీజియన్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు దామెర రంగారావు, కె రవి కుమార్, ఎస్ రామరాజు, బైలా లక్ష్మీనారాయణ, సీహెచ్ రమణమూర్తి, సజ్జాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నాగజ్యోతి, కార్యదర్శి ఏ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మరాఠా సంఘం నాయకులు

సాక్షి, భీమవరం: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పట్టణ మరాఠీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీని పశ్చిమగోదావరి జిల్లా ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు ప్రారంభించి మాట్లాడారు. దేశ చరిత్రలో శివాజీ మహారాజ్ సాహస గాథలు సువర్ణాధ్యాయంగా మిగిలాయని, 50 ఏళ్లు జీవించిన శివాజీ పరిపాలన దక్షత, క్రమశిక్షణ, సైనికులకు ఇచ్చిన శిక్షణ, మహిళల రక్షణ, మరాఠీ ప్రజలకు ఆదర్శంగా మారి ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్నారన్నారు. ఛత్రపతి చేసిన సేవలకు నేడు దేశవ్యాప్తంగా జయంతిని నిర్వహిస్తున్నారని అన్నారు. సంఘం నాయకులు చంద్రశేఖర్, శ్రీవిద్య మాట్లాడుతూ గత రెండేళ్లుగా వివిధ సంఘాల సహకారంతో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని, భావితరాలకు శివాజీ మహారాజు సాహస గాథలు తెలియజేసే ఉద్దేశంతో ఈ జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలో శివాజీ వేషధారణతో చిన్నారులు, మరాఠీ సంప్రదాయమైన తలపాగాలతో పెద్దలు ఆకర్షించారు. పట్టణ ప్రధాన వీధులలో ర్యాలీ కొనసాగింది. దాదాసేట్, షావుకారు సేట్, విఠోబా, మారుతీ, విష్ణు, పవన్, సుశీల్, పవన్, రామా, ప్రకాష్, బాలు, గేవర్ చంద్ మాలి, మరాఠీ మహిళలు పాల్గొన్నారు.

లింగోద్భవ సమయంలో పోటెత్తిన భక్తజనం



లక్ష్మణేశ్వరంలో పూజలు నిర్వహించిన దృశ్యం



క్షీరారామలింగేశ్వరస్వామికి మల్లన్న పాగా తీసుకువెళుతున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: మహాశివరాత్రి పురస్కరించుకుని పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. స్వామి వారి మల్లన్న పాగాను తయారు చేసిన వరదా సోమేశ్వరరావు 11.45 గంటల సమయంలో ఆలయంలో ప్రదక్షిణలు చేసి ఆలయ అర్చకులకు పాగాను అందజేశారు. పాగాను స్వామి వద్దకు తీసుకువెళ్లి పూజలు జరిపించారు. అనంతరం ఆలయ శిఖరం నుంచి గాలి గోపురం శిఖరం వరకూ పాగాను అలంకరించారు. లింగోద్భవ సమయం అనంతరం ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో స్వామివారికి లక్షపత్రి పూజ చేశారు. కొందరు భక్తులు ఏకాదశ మహా రుద్రాభిషేకాలు చేయించుకున్నారు. ఆదివారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం రావణాబ్రహ్మ వాహనంపై పార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి, లక్ష్మీ జనార్ధనస్వామి వార్లను ఊరేగించారు. గ్రామోత్సవానికి ముందుగా గాదె జనార్ధన గుప్త కుటుంబ సభ్యులు కుంభం పోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం వివిధ సన్నాయి వాయిద్యాలతో, బ్యాండ్ మేళాలతో, గరగల నృత్యాలతో స్వామివార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసు, ఆలయ ఈఓ యాళ్ల సూర్యనారాయణ, అర్చకులు కిష్టప్ప, మల్లేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా లక్ష్మణేశ్వరుని లింగోద్భవ పూజ

నరసాపురం రూరల్: శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి స్వామివార్ల లింగోద్భవ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు యలమంచిలి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో రాత్రి ఆలయంలో పలువురు దంపతులతో ప్రత్యేక పూజాభిషేకాలు, విశేషార్చన, కుంకుమార్చనలు చేయించారు. ఉదయం శేషార్చన, వసంతోత్సవం, ధ్వజారోహణ నిర్వహించారు. ఆలయ కార్యదర్శి చాగంటి సురేష్‌నాయుడు, ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు పాల్గొన్నారు.